# పాకప్రవీణ

సాధారణంగా ఏ ఇంట్లో "ధుం" అనినా రమణమ్మ అక్కడ వుండాల్సిందే. అంతకు క్రితం రమణమ్మని మర్చిపోయినవాళ్ళు, ఎరగని వాళ్ళు కూడా రమణమ్మని జ్ఞాపకం, పరిచయం చేసుకొని కాళ్ళు పట్టుకొని అయినా పిల్చుకొనిపోతారు. కారణం రమణమ్మ మహా నేర్పరి: ఆమె వంటగదిలో వుంటే వడలకు పప్పురుబ్బిచ్చే వాళ్ళు కూడా అనవసరమే: ఇటు వంట పని, అటు నీళ్ళపని, ఆ ఖర్మ వడ్డన సంగతికూడా నెగ్గించుకోగల, నెగ్గించగల చతుర!!! అందుకే రమణమ్మ అంటే కార్యాలు తలపెట్టినవాళ్ళు ఆమె కాళ్ళు పర్యంతం పట్టుకొంటారు. ఇంతకీ రమణమ్మ ఆశపోతు కాదు. ఆ ఖర్మ వారింట్లో అన్నం కూడా తినదు. టంచనుగా ఐదురూపాయలు, ఆ పైన వారి దయ ఎంతఇస్తే అంత తీసుకొని గుట్టుగా వెళ్ళిపోతుంది. ఒక పనిరాదు అనేమాటే రమణమ్మదగ్గర నాస్తి.

ఇంతా చేస్తే రమణమ్మ ఏ అరడుగుల మనిషో, దుక్కలాగుంటుందో, దంతవళమో అనుకోనేరు!: పట్టెడంతమనిషి. సన్నగా నాజూగ్గా వుంటుంది. రంగునలుపే అయినా ఆ పట్టెడంత పళ్ళు అందంగానే వుంటుంది. అయితే ఆ రెండు పళ్ళు కొద్దిగా ఎత్తు. అది తప్పితే రమణమ్మకేం లోటులేదు. పైనంచు పంచలు నెలకు నాలుగు కడుతుంది. సంవత్సరానికి పన్నెండు చీరలు కొనందే నిద్రపోదు. కష్టపడి వచ్చినడబ్బును ఆమె ఇంట్లో దాచుకోదు. తన ఖర్చులకు పోను మిగిలింది వడ్డీకిస్తుంది. ఇంతకీ ఆమె వయసుముప్పయ్ ఐదు; ఆ తలకు ముసుగే లేకపోతే ఏ పదపదహారేళ్ళపిల్లో అని అనుకోగలరు ఎవరేనా ఉన్నపాళాన చూస్తే. రమణమ్మని వంటవిషయంగా అడిగితే "ఆఁ...పాతికేళ్ళనుంచీ నా చేతుల్లో నలిగిన వంట విషయం ఏం చెప్పను. వంటఅంటే అసహ్యించుకొనే వాళ్ళూ వున్నారు. వంటంటే ప్రియంగా చూసుకొనేవాళ్లూ వున్నారు" అని వంటవిషయాన్ని సరిగ్గా చెప్పదు. ఆమె చేతివంట అమృతమే; ఆమాట అందరూ ఒప్పుకొంటారు.

ఒక్కసారి రమణమ్మని "నాకు వంట నేర్పండి" అని ఎవరేనా పడుచుపిల్లలు అడిగితే ... "మీ కెన్ని ఏళ్లు?" అని అడిగి పదునాలుగేళ్ళు దాటింది అంటే నోరు చప్పరించి "ఆఁ" మానయిపోయింది, వంట నీ వంటికి పట్టదు. నెమ్మదిగా నువ్వే నేర్చుకో అనేది. ఆ పడుచుపిల్లలకు కోపం వచ్చేది. ఇలాగా రమణమ్మ చెప్పడంవల్ల "స్వార్థపరురాలు" ఆమె అనుకొనేవారు. కానీ రమణమ్మ ఒకొక్కప్పుడు అమ్మలక్కలతో చెప్పుకొని ఏడ్చేది "మా అమ్మ నన్ను ఎనిమిదేళ్ళనుండీ వంటకు పెట్టింది. నాలుగేళ్ళకే పెళ్ళిచేసి నాతాడు తెంపింది. లేకపోతే ఎంచక్కా చదువుకొని ఏళ్ళు దాచుకొని నేనో కులుకులాడిలా వుండలేకపోయానా?"

ఏమయితే ఏం; రమణమ్మ వంటలక్కలా జీవితం ప్రారంభించింది. ఒక్క ముసిలి తండ్రి తప్పితే ఎవ్వరూ లేరు నాఅన్నవాళ్లు.

రమణమ్మ నోరుజారి చెప్పే మాటల్ని గురించి అమ్మలక్కలు విమర్శ చేసేవాళ్లు. "మహాగీర్వాణం. తానే అక్కడకి వంట మనిషి అయినట్లు, ఇంకెవ్వరిచాతా కాదా ఆ వంట" అని ఒకమ్మ అంటే, "మనం సోమరులమయితే రమణమ్మకి పేరొచ్చింది. రేపు నా కొడుకు వడుక్కి నేనే చేస్తాను" అని ఓ ఇల్లాలు సవాల్ చేసేది. "లేదమ్మా! మొత్తానికి రమణమ్మ వంటే వంట" అని ఒకపూర్వసువాసిని మెచ్చుకొంటే, "పదునాలుగేళ్ళకే ముదిరిపోతారా ఆడపిల్లలు, వాళ్ళకి వంట నేర్పి తనపేరు నిలిచేటట్టు చేసుకోకూడదా?" అని ఓ గృహిణి విమర్శించేది. వీళ్ళనుకొన్నట్లు రమణమ్మ ఏపిల్లకీ పాకశాస్త్ర రహస్యం చెప్పనందుకు అందరూ సత్యాగ్రహంచేసి శుభకార్యాలకి రమణమ్మని పిలవడం మానుకొన్నారు. మొదట్లో రమణమ్మ భయపడ్డది. కానీ ఆ తర్వాత ధైర్యంగానే వుండింది.

కమలమ్మగారింట్లో కొడుకు వడుక్కి రమణమ్మని పిలవాలని ఇంటాయన, పిలవకూడదని కమలమ్మ చాలాసేపు వాదించుకొన్నారు. ఆఖర్న కమలమ్మ కన్నీళ్ళ అస్త్రానికి అదిరిపోయి ఇంటాయన పిల్లిఅయిపోయాడు. వంటగదిలోని కమలమ్మ మరో ముగ్గుర్ని సాయంగా రమ్మని తాను పీటలపై వెళ్ళి కూచుంది. ఆ ముగ్గురూ చెయ్యలేదనుకోకుండా ఉషారుగా సాయం చేశారు. మూడు చేతులు కలిసిన చారు ఉప్పు కషాయమయింది. ఒకరిపై ఒకరు భారం వేసి ఇంకోపనికి పోయారు గనక కూర మాడిపోయింది. ఆ ముగ్గురిలో ఒకావిడ స్కూల్ ఫైనల్ ఫెయిల్డ్. ఆవిడకి వంట అసలు తెలియకపోవడం మూలాన పాయసానికి కేసరి పవుడర్ వేస్తారనే విషయం తెలియక, పసుపుపచ్చగా వుంటుందని, శుభంగాకూడా వుంటుందని పసుప్పొడి వేసింది!!! ఇంకో ఆవిడ ముగ్గురి బిడ్డల తల్లిఅయినా పదిమందికి వండిపెట్టేంత అదృష్టవంతురాలు కాకపోవడం వల్ల అంత పెద్ద తబిలని దించలేక తిరగతోసి మరలా వార్చింది. అందులో బొగ్గులు, రాళ్లు...కట్టెపేళ్ళు తాలూకు వస్తువులు కలిసిపోయాయి.

వడ్డన ప్రారంభమయింది. కొందరికి విస్తళ్లు వెయ్యకుండానే కమలమ్మ కుటుంబంవాళ్లు, సహాయార్థం వచ్చిన ఇరుగుపొరుగువాళ్లు వడ్డించేసేరు. ఆకులు వెయ్యనివాళ్ళ వరసలో కమలమ్మ భర్త (వాళ్ళ అదృష్టంకొద్దీ) వుండటం మూలాన ఆయన అరిచి ఆర్భాటం చేసేసరికి వడ్డించేవాళ్ళంతా మొదటివాళ్ల సంగతి మర్చిపోయి, ఇలా మళ్ళారు. మొదటివాళ్ళలో ఉద్యోగస్థులంతా వున్నారు. వాళ్ళను మర్చిపోకుండా కమలమ్మ పాయసం తెచ్చి వడ్డించేసరికి తాసీల్దారుగారు "ఈ వేళ రమణమ్మగారి వంట ఇంత అధ్వాన్నంగా వుందేం కమలమ్మా?" అని అడిగాడు.

"మర్చిపోయి కేసరి పవుడరనుకొని పసుప్పొడి పాయసంలో వేసినట్టుందే?" అన్నాడు మేజస్ట్రేట్. స్కూల్ ఫైనల్ అమ్మాయి ఆయనగారి సతీమణే?

కమలమ్మముఖం దమ్మిడీ అంతఅయింది.

"కూర ఇలా మాడిపోయిందే మమ్మా! ఊహుఁ...ఇన్నాళ్ళు రమణమ్మ చేసిన వంటకు ఈ వంట దిష్టిపరిహారం" తలవిదల్చాడు డాక్టరు బాబు, కూరని వారగా తోస్తో...

"అందర్నీ మీదగ్గరకు ఒక్కసారి పంపించేలాగుంది" అని చమత్కరించాడు లీడర్ బాబు నవ్వుతూ డాక్టరుబాబుతో.

మిస్ రాజేశ్వరీరాణి

కమలమ్మకు తల కొట్టేసినంత పని

(22-వ పేజీ చూడండి)

## పాక ప్రవీణ

(15-వ పేజీ తరువాయి)

అయింది. తల వంచుకు లోనికి వెళ్ళింది. వంటసాయానికి వచ్చిన అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకొంటూ తమ తమ తప్పులు ఏకరువు పెట్టుకొంటున్నారు. "మీ అందరి ఆసరా చాతకదా నేను రమణమ్మకి శాస్తి చేయాలని ఇలాంటిపనికి పూనుకున్నాను." అనికళ్ళనీళ్ళు రాల్చిందికమలమ్మ.

మేజస్ట్రేట్ పెళ్ళాం ముఖం చిట్లించి "నాకీ వంటపని అంటే తలనొప్పి. ఏదో మీ మాట దాటకూడదని వచ్చా. పుట్టింట ఎరగను, మెట్టినింట ఎరగను పొగ," అన్నది చాలా మెల్లిగా.

మిగతా ఇదరు ముఖాలు వంచుకొన్నారు. అక్కడికొచ్చి ఆ మాటలు విన్న ఓ మిడిమేలపు పిల్లవాడు పరుగున హాలులోకి వెళ్ళాడు. "రమణమ్మ రాలేదు వంటకి. మేజిస్ట్రేట్ అత్తయ్య, రాముమ్మత్తయ్య, జ్ఞానమ్మ పిన్ని, కమలమ్మ పిన్ని వండారు" అని అరిచి చాటించాడు. మేజస్ట్రేట్ ముఖం చింతగింజంత అయినా..."అదే అప్పుడే పసిగట్టేశాను. రమణమ్మవంట కాదని" అన్నాడు.

ఈ మాటలు రమణమ్మవింటే ఆమెకు ఇంకా గర్వమే హెచ్చవుతుందని గృహిణులు తలలు వేళ్ళాడతీసుకొన్నారు.

ఇది జరిగి నాలుగురోజు లయిపోయింది. రమణమ్మ మాత్రం ఆ విషయం ఎవ్వర్నీ అడిగి తెల్సుకోలేదు. కానీ ఆమెకు అంతా తెల్సు. అందరిళ్ళకూ మామూలుప్రకారం వచ్చిపోతుంటుంది. ఆనాటినుండీ ఇతర గృహిణులు కూడా వంటపని అంటే శ్రద్ధ చూపిస్తూ వుండేవాళ్లు. వంటఅంటే భయపడే ఆడదీ, అసహ్యించుకొనే స్త్రీ, బద్ధకించే సోమరీ...ఎలా చెయ్యడం అని దిగులుపడే ఇల్లాలూ "వంటపని" శ్రద్ధగా చేస్తున్నారు. అందరూ రమణమ్మని నిగూఢంగా అడిగి కిటుకులు తెల్సుకోవాలని ప్లాను వేసుకొన్నారు.

వడుగుభోజనంనుంచి లేస్తూ మేజస్ట్రేట్ అన్నాడు "గోపాలంబాబూ: ఇదేం బాగాలేదు. మీరు త్వరలో గొప్పవిందుచేయాలి. ఆ విందు వెలుగులో ఈ మచ్చ మాసిపోవాలి. ఏదన్నా చూడు నీ పుట్టినరోజన్నా వస్తుందేమో!" గోపాలంబాబు ఆ తర్వాత కమలమ్మని నాలుగూ అడిగేసరికి అసలు విషయం బయటపడ్డది. "ఈ ఆడవాళ్ళెప్పుడూ ఇంతే! ఎప్పుడూ కలహాలు. కలకంఠులు కారు కలహాకంఠులు. రమణమ్మని మనే పిలవాలి. అందరూ ఏమన్నారో తెలుసా? మరో డిన్నర్ కావాలట" అని చెప్పాడు.

కమలమ్మ సంకోచం లేకుండానే ఆనాడు రమణమ్మ రాగానే విషయం అంతా చెప్పివేసింది. రమణమ్మ నవ్వుతూ "అదేం భాగ్యం లెండి. ఆడవాళ్ళకు వంట చాతకాకపోతుంది. వంట అంటే అదో నీచమైన ఉద్యోగమని, వంటలక్క, అనిపించుకొంటే తమ పరువుకి నష్టమని అనుకొంటారు. ఆడది జీవితంలో సాధించవలసింది, సాధించేది "వంటే" అని నా అభిప్రాయం. కోటివిద్యలు కూటికొరకే కదా! వంటపని లేకపోతే ఆ తర్వాత ఒకళ్ళ కొకరితో పనేముంది? నలభీమ పాకాలని మీరు విని వుండలేదా? పూర్వం వాళ్లు కూడా "వంటే" చేసి పేరు పొందారు. శ్రద్ధపెడితే బ్రహ్మవిద్య కూసువిద్యయిపోతుంది" అని చిన్న లెక్చర్ కొట్టింది. ఆనాటి విందులో అధ్యక్షత వహించిన ఓ మంత్రి "పాకప్రవీణ" అని బిరుదుఇచ్చి రమణమ్మని సత్కరించారు. డిన్నర్ అయింతర్వాత! ★




## చౌర్యంలో క్రొత్తపంథా

(14-వ పేజీ తరువాయి)

కొంచెం ఇచ్చారంటే మీటింగు ఐపోయిందే...

కరుణా: దానికేమండీ తీసుకెళ్లండి.

(గడియారం తీసుకొని రంగనాయకులు నిష్క్రమిస్తాడు.)

### 3

(ఆ దినం రాత్రి ఏడుగంటలకు-కరుణాకరం చెమటకార్చుకుంటూ వచ్చి మంచం పైన పడిపోతాడు.)

శంకర్: మీ టింగు అప్పుడే ఐపోయిందా నాన్నా?

అన్నపూర్ణ: బాగా మాట్లాడారా నాన్నా? *Funk* గా లేదుగదా

శంకర్: పత్రికా ప్రతినిధు లందరూ వచ్చారా?

మీనాక్షి: కొంచెం నిదానించండి. బాగా టిఫిన్ చేసి వచ్చినట్లుంది. భుక్తాయాసం తీరనీ.

కరుణా: టిఫి నెక్కడిదే? వాడెవడో పచ్చిదొంగ. గడియారానికని ప్లాను వేసి నాకు నున్నగా తిరుక్షౌరం చేసేశాడు.

మీనాక్షి: అయ్యయ్యో! ఇంతకూ ఏం జరిగిందండీ?

కరుణా: జట్కావాడు ఇక్కడికి రెండుమైళ్ళ దూరంలో ఒక సందులో నన్ను దిగమన్నాడు. అక్కడ బ్రహ్మాండమైన పందిరేమో వుంది. కానీ అక్కడేదో సంతర్పణ జరుగుతుందట. తీరా విచారించబోయేసరికి 'యువజన సమితి' అనే సంస్థ ఈ వూర్లో లేదట! ఎవడో పట్టపగలే నా కండ్లల్లో కారం కొట్టేశాడు.

మీనాక్షి: మిమ్మల్ని చూస్తుంటే ఏడుపూ వస్తున్నది, నవ్వూ వస్తున్నదండీ! పోనీ ఆ సంతర్పణలో భోంచేస్తైనా రాకపోయారా?

కరుణా: ఏమి భోజనమో! ఏ మిత్రులో! ఏమి ప్రపంచమో! అంతామిథ్య.

మీనాక్షి: గడియారం దొంగలింపబడడం కూడా మిథ్యేనా? వెర్రివేదాంతాన్ని కట్టిపెట్టి లేవండి భోజనానికి. ★